16-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇక్కడ మీరు వనవాసంలో ఉన్నారు, మంచి మంచివి ధరించాలి, తినాలి... అనే అభిరుచి పిల్లలైన మీలో ఉండకూడదు, చదువు మరియు క్యారెక్టర్ పై పూర్తి-పూర్తి ధ్యానమును ఉంచండి"

ప్రశ్న:- జ్ఞాన రత్నాలతో సదా నిండుగా ఉండేందుకు సాధనము ఏమిటి?

జవాబు:- దానము. ఎంతెంతగా ఇతరులకు దానం చేస్తారో, అంతంతగా స్వయం నిండుగా ఉంటారు. ఎవరైతే విని, ధారణ చేసి, మళ్ళీ ఇతరులకు దానం చేస్తారో, వారు తెలివైనవారు. బుద్ధి రూపీ జోలెలో ఒకవేళ రంధ్రము ఉన్నట్లయితే, అవి బయటకు జారిపోతాయి, ధారణ జరగదు, అందుకే నియమానుసారముగా చదువును చదవాలి. పంచ వికారాల నుండి దూరముగా ఉండాలి. రూపము మరియు సుగంధము కలవారిగా అవ్వాలి.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు. ఆత్మిక తండ్రి కూడా కర్మేంద్రియాల ద్వారానే మాట్లాడుతారు, ఆత్మిక పిల్లలు కూడా కర్మేంద్రియాల ద్వారానే వింటారు. ఇది కొత్త విషయము. ప్రపంచములోని మనుష్యులెవ్వరూ ఈ విధంగా చెప్పలేరు. మీలో కూడా నంబరువారు పురుషార్థానుసారముగానే అర్థం చేయిస్తారు. టీచర్ చదివించినప్పుడు విద్యార్థుల రిజిస్టర్ అది చూపిస్తుంది. రిజిస్టర్ ద్వారా వారి చదువు మరియు నడవడిక గురించి తెలిసిపోతుంది. ముఖ్యమైనవి చదువు మరియు నడవడికయే. ఇది ఈశ్వరీయ చదువు, దీనిని ఇంకెవ్వరూ చదివించలేరు. ఇది రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల గురించి, సృష్టి చక్రం గురించిన జ్ఞానము, దీని గురించి మొత్తం ప్రపంచమంతటిలోని మానవమాత్రులెవ్వరికీ తెలియదు. ఋషులు, మునులు ఎవరైతే ఎంతగానో చదువుకున్న అథారిటీలుగా ఉన్నారో, ఆ ప్రాచీన ఋషులు, మునులు - మాకు రచయిత మరియు రచనల గురించి తెలియదు అని స్వయం అనేవారు. తండ్రియే వచ్చి పరిచయాన్ని ఇచ్చారు. ఇది ముళ్ళ అడవి అని అంటూ ఉంటారు కూడా. అడవికి తప్పకుండా నిప్పు అంటుకుంటుంది, పుష్పాల తోటకు ఎప్పుడూ నిప్పు అంటుకోదు ఎందుకంటే మొత్తం అడవి అంతా ఎండిపోయి ఉంది, పుష్పాల తోట పచ్చగా ఉంటుంది. పచ్చని పుష్పాల తోటకు నిప్పు అంటుకోదు. ఎండిపోయినదానికి వెంటనే నిప్పు అంటుకుంటుంది. ఇది అనంతమైన అడవి, దీనికి కూడా నిప్పు అంటుకుంది. పుష్పాల తోట కూడా ఇంతకుముందు స్థాపన అయ్యింది. మీ పుష్పాలతోట ఇప్పుడు గుప్తముగా స్థాపన అవుతోంది. మనము పుష్పాల తోటలోని పుష్పాలుగా, సుగంధమయమైన దేవతలుగా తయారవుతున్నామని మీకు తెలుసు, దాని పేరే స్వర్గము. ఇప్పుడు స్వర్గ స్థాపన జరుగుతోంది. ఆశ్చర్యమేమిటంటే, మీరు ఎంతమందికి అర్థం చేయించినా కానీ ఇది ఎవరి బుద్ధిలోనూ కూర్చోదు. ఎవరైతే ఈ ధర్మానికి చెందనివారు కారో వారి బుద్ధిలో కూర్చోదు కూడా. ఒక చెవితో వింటారు, ఇంకొక చెవితో వదిలేస్తారు. సత్య, త్రేతాయుగాలలో భారతవాసులు ఎంత కొద్దిమంది ఉంటారు. ఆ తర్వాత ద్వాపర, కలియుగాలలో ఎంత వృద్ధి జరుగుతుంది. అక్కడ 1-2 పిల్లలు ఉంటే ఇక్కడ 4-5 పిల్లలు ఉన్నారు, అంటే తప్పకుండా వృద్ధి జరిగినట్లే. భారతవాసులే ఇప్పుడు హిందువులుగా పిలవబడతారు. వాస్తవానికి వీరు దేవతా ధర్మానికి చెందినవారు, ఇంకే ఇతర ధర్మాలవారూ తమ ధర్మాన్ని మర్చిపోరు. ఈ భారతవాసులే మర్చిపోయారు. ఈ సమయంలో ఎంతమంది మనుష్యులు ఉన్నారో చూడండి. ఇంత ఎక్కువమంది అయితే వచ్చి జ్ఞానాన్ని తీసుకోరు. ప్రతి ఒక్కరూ తమ జన్మల గురించి కూడా అర్థం చేసుకోగలరు. ఎవరైతే పూర్తి 84 జన్మలను తీసుకొని ఉంటారో, వారు తప్పకుండా పురాతన భక్తులే అయి ఉంటారు. మనం ఎంత భక్తి చేసాము అనేది మీరు అర్థం చేసుకోగలరు. కొద్దిగా చేసి ఉంటే జ్ఞానాన్ని కూడా కొద్దిగానే తీసుకుంటారు మరియు కొద్దిమందికే అర్థం చేయిస్తారు. ఎక్కువ భక్తి చేసి ఉంటే జ్ఞానాన్ని కూడా ఎక్కువగా తీసుకుంటారు మరియు ఎక్కువ మందికి అర్థం చేయిస్తారు. జ్ఞానాన్ని తీసుకోకపోతే తక్కువగానే అర్థం చేయించగలరు, అందుకే వారికి ఫలము కూడా కొద్దిగానే లభిస్తుంది. లెక్క ఉంది కదా.

ఇస్లాములకు ఇన్ని జన్మలు, బౌద్ధులకు ఇన్ని జన్మలు ఉండాలి అంటూ ఒక బిడ్డ తండ్రి వద్దకు లెక్క వేసి పంపించారు. బుద్ధుడు కూడా ధర్మ స్థాపకుడు. అతనికన్నా ముందు బౌద్ధ ధర్మం వారు ఎవరూ లేరు. బుద్ధుని ఆత్మ ప్రవేశించింది. ఆ ఆత్మ బౌద్ధ ధర్మాన్ని స్థాపించారు. ఆ తర్వాత ఆ ఒక్కరి నుండి వృద్ధి జరుగుతుంది. వారు కూడా ఒక ప్రజాపితయే. ఒక్కరి నుండి ఎంత వృద్ధి జరుగుతుంది. మీరైతే కొత్త ప్రపంచములో రాజుగా అవ్వాలి. ఇక్కడైతే మీరు వనవాసములో ఉన్నారు. ఏ వస్తువు పట్ల అభిరుచి ఉండకూడదు. మేము మంచి బట్టలు మొదలైనవి ధరించాలి, ఇది కూడా దేహాభిమానమే. ఏది లభిస్తే అదే మంచిది. ఈ ప్రపంచమే కొద్ది సమయం ఉంటుంది. ఇక్కడ మంచి బట్టలు ధరిస్తే

అక్కడ మళ్ళీ తగ్గిపోతుంది. ఈ అభిరుచిని కూడా వదిలిపేయాలి. మున్ముందు పిల్లలైన మీకు వాటంతటవే సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి. ఫలానావారు చాలా మంచి సేవను చేస్తున్నారు, అద్భుతము, వారు తప్పకుండా ఉన్నతమైన నంబరును తీసుకుంటారు అని మీరు స్వయం అంటారు. అలా తమ సమానముగా తయారుచేస్తూ ఉంటారు. రోజురోజుకు పుష్పాల తోట అయితే పెద్దదిదా అయ్యేదే ఉంది. ఎంతమంది దేవీ-దేవతలైతే సత్యయుగములో లేక త్రేతాయుగములో ఉంటారో, వారందరూ గుప్తముగా ఇప్పుడు ఇక్కడే కూర్చొని ఉన్నారు, ఆ తర్వాత ప్రత్యక్షమవుతారు. ఇప్పుడు మీరు గుప్తముగా పదవిని పొందుతున్నారు. మనం చదువుకుంటోంది మృత్యులోకములో అని, పదవిని అమరలోకములో పొందుతామని మీకు తెలుసు. ఇటువంటి చదువును ఎప్పుడైనా చూసారా. ఇది విచిత్రము. చదవుకునేది పాత ప్రపంచములో, పదవిని పొందేది కొత్త ప్రపంచములో. ఎవరైతే అమరలోక స్థాపనను మరియు మృత్యులోకపు వినాశనాన్ని చేయిస్తారో వారే చదివిస్తారు కూడా. మీ ఈ పురుషోత్తమ సంగమయుగము చాలా చిన్నది, ఇందులోనే చదివించేందుకు తండ్రి వస్తారు. వారు వచ్చీ రాగానే చదువు ప్రారంభమైపోతుంది. అందుకే తండ్రి అంటారు, శివ జయంతియే గీతా జయంతి అని వ్రాయండి. దీని గురించి మనుష్యులకు తెలియదు. వారు శ్రీకృష్ణుని పేరును పెట్టేసారు. ఇప్పుడు ఈ పొరపాటును ఎవరైనా అర్థం చేసుకోవాలి. ఎంతో గొప్ప-గొప్ప వ్యక్తులు మ్యూజియంకు వస్తారు, వారికి తండ్రి గురించి తెలుసని కాదు, వారికి ఏమీ తెలియదు, అందుకే బాబా అంటారు - ఫారంను నింపించినట్లయితే ఎంతో కొంత నేర్చుకున్నారు అన్నది తెలుస్తుంది. లేదంటే వారు ఇక్కడకు వచ్చి ఏం చేస్తారు? ఎలాగైతే సాధు-సన్యాసులు, మహాత్ముల వద్దకు వెళ్తారో, ఇక్కడ అటువంటి విషయమేమీ లేదు. వీరిదైతే అదే సాధారణమైన రూపము. వీరి వస్త్రధారణలో కూడా ఎటువంటి మార్పు లేదు, అందుకే ఎవరూ అర్థం చేసుకోలేరు. వీరు వజ్రాల వ్యాపారిగా ఉండేవారు అని భావిస్తారు. మొదట వినాశీ రత్నాల వ్యాపారిగా ఉండేవారు, ఇప్పుడు అవినాశీ రత్నాల వ్యాపారిగా అయ్యారు. మీరు వ్యాపారం కూడా అనంతమైన తండ్రితో చేస్తారు. వారు గొప్ప వ్యాపారి, ఇంద్రజాలికుడు, రత్నాకరుడు. కావున ప్రతి ఒక్కరూ తమను తాము - మేము రూపము మరియు సుగంధము కలవారము అని అర్థం చేసుకోండి. మన లోపల లక్షల రూపాయలు విలువ చేసే జ్ఞాన రత్నాలు ఉన్నాయి. ఈ జ్ఞాన రత్నాలతో మీరు పారస బుద్ధి కలవారిగా అవుతారు. ఇది కూడా అర్థం చేసుకోవలసిన విషయము. ఈ విషయాలను ధారణ చేయడంలో కొందరు చాలా మంచి తెలివైనవారిగా ఉన్నారు. ఒకవేళ ధారణ జరగకపోతే వారు ఎందుకూ పనికిరారు. వారి జోలెలో రంధ్రము ఉంది, దాని నుండి బయటకు జారిపోతుంది అని అర్థం చేసుకోండి. తండ్రి అంటారు - నేను మీకు అవినాశీ జ్ఞాన రత్నాలను దానం చేస్తాను. ఒకవేళ మీరు దానం చేస్తూ ఉన్నట్లయితే నిండుగా ఉంటారు. లేదంటే ఏమీ ఉండదు, ఖాళీగా ఉంటారు. చదవరు, నియమానుసారముగా నడవరు. ఇందులో సబ్జెక్టులు చాలా బాగున్నాయి. పంచ వికారాల నుండి మీరు పూర్తిగా దూరముగా వెళ్ళాలి.

తండ్రి అర్థం చేయించారు - ఈ రక్షాబంధనమునేదైతే జరుపుకుంటారో అది కూడా ఈ సమయానికి చెందినదే. కానీ మనుష్యులకు రాఖీ ఎందుకు కడతారు అనే అర్థం తెలియదు. వారైతే అపవిత్రముగా అవుతూ ఉంటారు, రాఖీని కట్టుకుంటూ ఉంటారు. పూర్వము బ్రాహ్మణులు రాఖీని కట్టేవారు. ఇప్పుడు చేతి ఖర్చుల కోసం సోదరీలు తమ సోదరులకు రాఖీ కడతారు. అక్కడ పవిత్రత యొక్క విషయం కాదు. చాలా ఫ్యాషనబుల్ రాఖీలను తయారుచేస్తారు. ఈ దీపావళి, దసరా అన్నీ సంగమయుగానికి చెందినవే. తండ్రి ఏ పాత్రనైతే అభినయించారో, అదే మళ్ళీ భక్తి మార్గంలో కొనసాగుతుంది. తండ్రి మీకు సత్యమైన గీతను వినిపించి ఈ లక్ష్మీ-నారాయణులుగా తయారుచేస్తారు. ఇప్పుడు మీరు ఫస్ట్ గ్రేడ్ లోకి (ప్రథమ శ్రేణిలోకి) వెళ్తారు. సత్యనారాయణుని కథను విని మీరు నరుని నుండి నారాయణునిగా అవుతారు. ఇప్పుడు పిల్లలైన మీరు మొత్తం ప్రపంచాన్ని మేల్కొలపాలి. అందుకు ఎంతటి యోగ శక్తి కావాలి. యోగ శక్తి ద్వారానే మీరు కల్ప-కల్పమూ స్వర్గ స్థాపనను చేస్తారు. యోగబలము ద్వారా స్థాపన జరుగుతుంది, బాహుబలము ద్వారా వినాశనము జరుగుతుంది. రెండే పదాలు ఉన్నాయి - అల్ఫ్ మరియు బే (భగవంతుడు మరియు వారసత్వము). యోగబలముతో మీరు విశ్వానికి యజమానులుగా అవుతారు. మీ జ్ఞానము పూర్తిగా గుప్తమైనది. సతోప్రధానముగా ఉన్న మీరు ఇప్పుడు తమోప్రధానముగా అయ్యారు, మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. ప్రతి వస్తువు కొత్తది నుండి పాతదిగా తప్పకుండా అవుతుంది. కొత్త ప్రపంచములో ఉండనిది అంటూ ఏముంది. పాత ప్రపంచములోనైతే అసలు ఏమీ లేదు. ఖాళీ డబ్బాలా ఉంది. స్వర్గములా ఉన్న భారత్ ఎక్కడ, ఇప్పుడు నరకములా ఉన్న భారత్ ఎక్కడ. రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. రావణుని దిష్టిబొమ్మను తయారుచేసి కాలుస్తారు, కానీ దాని అర్థాన్ని తెలుసుకోరు. వారు ఏమేమి చేస్తున్నారు అనేది ఇప్పుడు మీకు అర్థమవుతుంది. మీలో కూడా నిన్న అజ్ఞానం ఉండేది, ఈ రోజు జ్ఞానం ఉంది. నిన్న నరకములో ఉండేవారు, ఈ రోజు నిజమైన స్వర్గములోకి వెళ్తున్నారు. ప్రపంచములోనివారు స్వర్గస్థులయ్యారు అని అన్నట్లు కాదు. మీరు ఇప్పుడు స్వర్గములోకి వెళ్ళినట్లయితే ఇక

నరకము ఉండనే ఉండదు. ఇది ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయము. ఇది ఒక్క క్షణము యొక్క విషయము. తండ్రిని స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. ఇది అందరికీ తెలియజేస్తూ ఉండండి. మీరు ఈ లక్ష్మీ-నారాయణుల వలె ఉండేవారు, తర్వాత 84 జన్మలను తీసుకొని ఈ విధంగా అయ్యారు అని చెప్పండి. సతోప్రధానము నుండి తమోప్రధానముగా అయ్యారు, మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి. ఆత్మ అయితే వినాశనమవ్వదు, ఇకపోతే తమోప్రధానము నుండి సతోప్రధానముగా మళ్ళీ అవ్వాల్సిందే. బాబా రకరకాలుగా అర్థం చేయిస్తూ ఉంటారు. నా బ్యాటరీ ఎప్పుడూ పాతదిగా అవ్వదు. బాబా కేవలం అంటారు - స్వయాన్ని బిందు ఆత్మగా భావించండి. వీరి ఆత్మ వెళ్ళిపోయింది అని అంటారు. అంటే ఆత్మ సంస్కారాల అనుసారంగా ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటుంది. ఇప్పుడు ఆత్మలు ఇంటికి వెళ్ళాలి. ఇది కూడా డ్రామాయే. సృష్టి చక్రము రిపీట్ అవుతూనే ఉంటుంది. ప్రపంచములో ఇంతమంది మనుష్యులు ఉన్నారు అని చివరిలో లెక్క వేసి చెప్తారు. ఇంతమంది ఆత్మలు ఉన్నారు అని ఎందుకు చెప్పరు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు నన్ను ఎంతగా మర్చిపోయారు. మళ్ళీ నేనే అందరి కళ్యాణము చేయాలి, అందుకే తండ్రిని పిలుస్తారు. మీరు తండ్రిని మర్చిపోతారు, తండ్రి పిల్లలను మర్చిపోరు. తండ్రి పతితులను పావనంగా చేసేందుకే వస్తారు. ఇది గోముఖము, అంతేకానీ ఎద్దు మొదలైనవాటి విషయమేమీ లేదు. వీరు భాగ్యశాలీ రథము. శివబాబా మనల్ని అలంకరిస్తారు అని ఈ బాబా పిల్లలైన మీతో అంటారు. ఇది పక్కాగా గుర్తుండాలి. శివబాబాను స్మృతి చేయడం వలన ఎంతో లాభము ఉంటుంది. బాబా మనల్ని వీరి (బ్రహ్మా) ద్వారా చదివిస్తారు, కానీ వీరిని స్మృతి చేయకూడదు. సద్గురువు ఒక్క శివబాబాయే, వారిపై మీరు బలిహారమవ్వాలి. ఇతను కూడా వారిపైనే బలిహారమయ్యారు కదా. తండ్రి అంటారు - నన్నొక్కరినే స్మృతి చేయండి. పిల్లలు సత్యయుగీ పుష్పాల ప్రపంచములోకి వెళ్తారు, మరి ఈ ముళ్ళపై మోహమెందుకు ఉండాలి. 63 జన్మలు భక్తి మార్గపు శాస్త్రాలను చదువుతూ పూజలు చేస్తూ వచ్చారు. మీరు పూజ కూడా మొదట శివబాబాకే చేసారు, అప్పుడే సోమనాథ మందిరాన్ని తయారుచేసారు. మందిరాలైతే రాజులందరి ఇళ్ళలోనూ ఉండేవి, ఎన్ని వజ్ర-వైఢూర్యాలు ఉండేవి. ఆ తర్వాత వచ్చి దాడి చేసారు. ఒక్క మందిరము నుండే ఎంత బంగారము మొదలైనవి తీసుకువెళ్ళారు. మీరు అంతటి ధనవంతులుగా, విశ్వానికి యజమానులుగా అవుతారు. వీరు ధనవంతులుగా ఉండేవారు, విశ్వానికి యజమానులుగా ఉండేవారు, కానీ వీరి రాజ్యం గడిచి ఎన్నాళ్ళు అయ్యింది, ఎవరికీ తెలియదు. తండ్రి అంటారు, 5000 సంవత్సరాలు అయ్యింది. 2500 సంవత్సరాలు రాజ్యం చేసారు, మిగిలిన 2500 సంవత్సరాలలో ఎన్నో మతాలు-మార్గాలు మొదలైనవి వృద్ధి చెందుతాయి.

మమ్మల్ని అనంతమైన తండ్రి చదివిస్తున్నారని పిల్లలైన మీకు ఎంతో సంతోషము ఉండాలి. అపారమైన సంపద లభిస్తుంది. సముద్రము నుండి దేవతలు పళ్ళెములలో రత్నాలను నింపి తీసుకొచ్చినట్లుగా చూపిస్తారు. ఇప్పుడు మీకు జ్ఞాన రత్నాల పళ్ళెములు బాగా నిండుగా లభిస్తాయి. తండ్రి అయితే జ్ఞానసాగరుడు. కొందరు మంచి రీతిలో పళ్ళెమును నింపుకుంటారు, కొందరిది బయటకు జారిపోతుంది. ఎవరైతే మంచి రీతిలో చదువుకుంటారో, చదివిస్తారో వారు తప్పకుండా మంచి ధనవంతులుగా అవుతారు. రాజధాని స్థాపన అవుతోంది. ఇది డ్రామాలో నిశ్చితమై ఉంది. ఎవరైతే మంచి రీతిలో చదువుకుంటారో, వారికే స్కాలర్షిప్ లభిస్తుంది. ఇది ఈశ్వరీయ స్కాలర్షిప్, అవినాశీ అయినది. అది వినాశీ అయినది. మెట్ల వరుస చిత్రం చాలా అద్భుతమైనది. అందులో 84 జన్మల కథ ఉంది కదా. తండ్రి అంటారు - మెట్ల వరుస చిత్రం యొక్క ట్రాన్స్ లైట్ ను ఎంత పెద్దగా తయారుచేయండి అంటే అది దూరము నుండే బాగా స్పష్టముగా కనిపించాలి. మనుష్యులు చూసి ఆశ్చర్యపోతారు. ఆ తర్వాత మీ పేరు కూడా ప్రఖ్యాతమవుతూ ఉంటుంది. ఇప్పుడు ఎవరైతే చుట్టూ తిరిగి వెళ్ళిపోతారో, వారు చివరిలో వస్తారు. 2-4 సార్లు చుట్టూ తిరుగుతారు, భాగ్యములో ఉంటే నిలుస్తారు. దీపమైతే ఒకటే ఉంది, కావున ఇంకెక్కడికి వెళ్తారు. పిల్లలు చాలా మధురముగా అవ్వాలి. యోగములో ఉన్నప్పుడే మధురముగా అవుతారు. యోగము ద్వారానే ఆకర్షణ కలుగుతుంది. ఎప్పటివరకైతే తుప్పు వదలదో అప్పటివరకూ ఎవరికీ ఆకర్షణ కూడా కలుగదు. ఈ మెట్ల వరుస చిత్రం యొక్క రహస్యాన్ని ఆత్మలందరికి తెలియజేయాలి. మెల్లమెల్లగా, నంబరువారుగా అందరూ తెలుసుకుంటూ ఉంటారు. ఇది డ్రామా. ప్రపంచ చరిత్ర-భౌగోళికము రిపీట్ అవుతూ ఉంటాయి. ఎవరైతే వీటిని అర్థం చేయించారో, వారిని స్మృతి చేయాలి కదా. తండ్రిని సర్వవ్యాపి అని అంటారు కానీ అక్కడ సర్వవ్యాపిగా ఉన్నది మాయ. ఇక్కడ ఉన్నది తండ్రి ఎందుకంటే వీరు ఒక్క క్షణములో రాగలరు. బాబా వీరిలో కూర్చొనే ఉన్నారు అని మీరు భావించాలి. వారు చేసేవారు-చేయించేవారు కదా. వారు చేస్తారు కూడా, చేయిస్తారు కూడా. పిల్లలకు డైరెక్షన్లు ఇస్తారు, స్వయం కూడా చేస్తూ ఉంటారు. వారు ఈ శరీరములో ఉంటూ ఏమి చేయగలరు మరియు ఏమి చేయలేరు అన్న లెక్కను తీయండి. బాబా తినరు, సుగంధాన్ని

తీసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. రూపము మరియు సుగంధము కలవారిగా అయి మీ బుద్ధి రూపీ జోలెను అవినాశీ జ్ఞాన రత్నాలతో సదా నిండుగా ఉంచుకోవాలి. బుద్ధి రూపీ జోలెలో ఏ విధమైన రంధ్రమూ ఉండకూడదు. జ్ఞాన రత్నాలను ధారణ చేసి ఇతరులకు దానం చేయాలి.

2. స్కాలర్షిప్ ను తీసుకొనేందుకు చదువును బాగా చదవాలి. పూర్తి వనవాసములో ఉండాలి. ఏ రకమైన అభిరుచినీ ఉంచుకోకూడదు. సుగంధమయమైన పుష్పాలుగా అయి ఇతరులను కూడా అలా తయారుచేయాలి.

వరదానము:- విషయాల రూపీ మేఘాలను చూసి గాభరా పడేందుకు బదులుగా వాటిని క్షణములో దాటి వేసే సిద్ధి స్వరూప భవ

చాలామంది పిల్లలు శాస్త్రవాదుల వలె విషయాలను తయారుచెయ్యటంలో చాలా తెలివైనవారిగా ఉంటారు. ఎటువంటి విషయాలను తయారుచేస్తారంటే వాటిని వినటంతోనే తండ్రికి కూడా నవ్వు వస్తుంది. కానీ ఇతరులు ప్రభావితులైపోతారు. ఈ అనేక రకాల వ్యర్థ విషయాలు వ్యర్థ రిజిస్టర్ల కట్టలను తయారుచేస్తూ ఉంటాయి. అందుకే వీటి నుండి వేగంగా ఎగిరిపోండి, అమాయకులుగా అవ్వండి. తండ్రిని చూడండి, విషయాలను కాదు. ఈ విషయాలే మేఘాలు, వీటిని క్షణములో దాటివేసే విధి ద్వారా సిద్ధి స్వరూపులుగా అవ్వండి.

స్లోగన్:- ఏ విషయములోనైనా ప్రశ్నార్థకము రావటము అనగా వ్యర్థ ఖాతా ప్రారంభమవ్వటము.

అవ్యక్త సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

ఇప్పుడు మీ మనసులోని శుభ భావనలను ఇతర ఆత్మల వరకు చేర్చండి. సైలెన్స్ శక్తిని ప్రత్యక్షము చెయ్యండి. బ్రాహ్మణ పిల్లలు ప్రతి ఒక్కరిలో ఈ సైలెన్స్ శక్తి ఉంది. కేవలము ఈ శక్తిని మనసులో, తనువులో ఇమర్జ్ చేయండి. ఒక్క క్షణములో మనసులోని సంకల్పాలను ఏకాగ్రము చెయ్యండి, అప్పుడు ఫరిశ్తా రూపము ద్వారా వాయుమండలములో సైలెన్స్ శక్తి ప్రకంపనాలు వ్యాపించగలవు.